క్లుప్తంగా

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే అడ్డుకుంటాం

కారెంపూడి: ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీ ధరలకే షాపుల నిర్వాహకులు మద్యం విక్రయాలు జరపాలని, అలా కాకుండా ఎక్కువ రేట్లకు అమ్మితే అడ్డుకుంటామని జనసేన పార్టీ మాచర్ల నియోజకవర్గ సమన్వయ కర్త, న్యాయవాది బి.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారు నిబంధనల ప్రకారం షాపులు నిర్వహించాలని, ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు మద్యం విక్రయాలు జరిపితే అడ్డుకుంటామని పేర్కొన్నారు. మద్యంలో నాణ్యత లోపించిన అధిక ధరలు వసూలు చేసి ప్రజలను ఇబ్బందుల పాలు చేసినా ఇది ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధమని దీనిని వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు.

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి



రెంటచింతల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కోసం అర్హులైన వారు నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని యూటీఎఫ్ మండల నాయకులు వీజేవీ రాజ్‌కుమార్, ఓర్సు సాగర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ఫారంను ఆవిష్కరించారు. ఈ విషయంలో సహాయం అవసరమైతే స్థానిక యూటీఎఫ్ నాయకుల 9949852136, 9849703825 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సుదర్శన్, రామాచారి, ఎం. సురేష్ బాబు, వసంతకుమారి పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): పాలువాయి జంక్షన్‌లోని షిరిడి సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు షిరిడిసాయి బాబాకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడి సాయిబాబాను పూజిస్తే కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు ప్రాంతంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజనా బృందం గీతాలను ఆలపించింది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ చైర్మన్ వందిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

అడిగినవారందరికీ వంద రోజుల పని



రెంటచింతల: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉండి అడిగిన వారందరికీ వంద రోజుల పని కల్పించాలని ఎంపీడీఓ సరోజినిదేవి చెప్పారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రతి కుటుంబానికీ 100 రోజుల ఉపాధి ఖచ్చితంగా కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనన్నారు. కూలీలకు సహకరించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వం ప్రారంభించిన పల్లెపండుగ, ప్లానింగ్ ప్రాసెస్, పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించడంపై ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలు చేశారు. సమావేశంలో ఏపీఓ జయచంద్ర కుమార్, ఈసీ నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆర్.సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



దాచేపల్లి : కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని నాయకులు జీవీ. శ్రీనివాసరావు, జి.శాంతారావు ప్రారంభించి మాట్లాడుతూ.. అర్హత కలిగిన వారందరూ ఓటు నమోదు చేసుకునేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సేవలు ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వట్టెపు నాగేశ్వరరావు, పి. రాజారావు, ఆనంద్‌కుమార్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

‘అయ్యో’ర్లా ఇదేమీ!

- ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమానికి అనుబంధ శాఖల అధికారుల గైర్హాజరు
- ఒక్క వ్యవసాయాధికారితోనే మమ
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సమాధానంపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ (ఫైల్)

గురజాల : పొలం పిలుస్తోంది. కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. కూటమి ప్రభుత్వం హంగూ ఆర్భాటాలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రచారం ఎక్కువ పని తక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది గైర్హాజరవుతుండటంతో కార్యక్రమం అభాసుపాలవుతోంది. పంటల సాగులో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలన్న లక్ష్యంతో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి సర్కారు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. ఉదయం, సాయంత్రం వ్యవసాయ అధికారులతో పాటు వాటి అనుబంధ శాఖల అధికారులు సైతం పొలం బాట పట్టి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఆధునిక పంటలపై దృష్టి సారించేలా చర్యలు చేపట్టడంతోపాటు సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నదాతలను కలిసి సాగు కష్టాలు తెలుసుకుని నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలి. అంతే కాకుండా అధికారులు రైతు వద్దకు వెళ్లి పంట పరిశీలనలో లోపాలు గుర్తించాలి. పంట దిగుబడి తగ్గడానికి గల కారణాలు, సూక్ష్మ పోషకాలను గుర్తించి భూసారం పెంచేలా సూచనలు చేయడం , భూసార కార్డుల పంపిణీ, తుంపర, బిందు సేద్యం పథకం దిశగా ప్రోత్సహించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది.

అధికారులు దూరం

పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు వ్యవసాయ శాఖ అధికారులతోపాటు ఆత్మ, ఏపీ సీఎస్ఎఫ్, ఉద్యానవన, సెరికల్చర్, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, కో– ఆపరేటివ్ ఫెడరేషన్, కెనాల్స్, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయం వంటి పదికిపైగా శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉంది. కానీ గురజాల మండలంలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమానికి కేవలం వ్యవసాయాధికారిణి, సిబ్బంది మాత్రమే హాజరవుతున్నారు. దీంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. రైతులు కూడా అంతంతమాత్రంగానే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

వాల్మీకి మహర్షి సదా స్మరణీయులు



రెంటచింతల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి



దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి

రెంటచింతల/దాచేపల్లి/మాచవరం: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.మోహన్, కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వాల్మీకి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.లింగయ్య, ఎస్.భాగ్యమేరి, పి.సత్రాజిబేగం, జే. కృష్ణనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

- మహర్షి వాల్మీకి జయంత్యుత్సవం గురువారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ వైవీ కుటుంబరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి జీవిత చరిత్ర గురించి తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ రాజు, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాచవరం మండలం చెన్నాయపాలెంలో..

- మాచవరం మండలంలోని చెన్నాయపాలెం, పిల్లుట్ల, పిన్నెల్లి గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి బోయ నాయకులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



శ్రీరుక్మిణీపురంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు, గ్రామ పెద్దలు

మాచవరం/పిడుగురాళ్ల: పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని శ్రీరుక్మిణీపురం, నాగేశ్వరపురం తండా, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో సీసీ రోడ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కొత్త గణేశునిపాడు గ్రామానికి రూ.15 లక్షలు, శ్రీరుక్మిణీపురం రూ.4 లక్షల 89 వేలు, నాగేశ్వరపురం తండా రూ.2లక్షల 30వేలు నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకటేశ్వర్లు , ఈఓపీఆర్డీ వెంగళరావు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పెద్దలు పాల్గొన్నారు.

- పిడుగురాళ్ల మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. ఎంపీడీవో రామచంద్రయ్య ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఏఈపీఆర్ గాదే శ్రీనివాస్‌రెడ్డి, ఈవోపీఆర్డీ దయాసాగర్, ఏపీవో మేరిగ్రేస్, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ కోదాటి మృతి

గురజాల : ఆర్ఎంపీ కోదాటి ఆంజనేయులు (62) బుధవారం రాత్రి గురజాలలోని తన స్వగృహంలో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్వతహాగా క్లినిక్ ఏర్పాటుచేసి 40ఏళ్లకుపైగా పట్టణ ప్రజలకు ఆయన వైద్యసేవలు అందించారు. పలువురు వైద్యులు, ఆర్ఎంపీలు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైద్యుడు చల్లగుండ్ల శ్రీనివాసరావు, మెడికల్ అసోసియేషన్ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలి



శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందించాలని డీఎంహెచ్‌వో బి.రవి అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రవి మాట్లాడుతూ గర్భిణులు నమోదు పురోగతి వేగవంతమయ్యేలా వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. మండల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మాణ్యం రాధాకృష్ణన్ ,సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి ఉన్నారు.

రూ.4 కోట్లతో చెంచు కాలనీల్లో మౌలిక వసతులు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అలుగుమల్లి సంజీవరెడ్డి

వెల్దుర్తి: జన్‌మన్ పథకం ద్వారా మండలంలోని 20 చెంచుగూడెంలలో రూ.4 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రతినిధులు మండల స్థాయి అధికారులందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కొన్ని గ్రామాలలో పైపులైన్ పనులు పూర్తి కాగా, మరికొన్ని గ్రామాలలో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మరికొన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం కల్పించేందుకు టెండర్లు పిలిచి పనులన్నీ పూర్తి చేసి ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, ఎంపీడీఓ డి ప్రసాద్, తహశీల్దార్ షేక్ బాషా, ఎఈలు శ్రీనివాసరెడ్డి, బాబు నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా, వైద్యులు శ్రీరామ్, ప్రసన్నలక్ష్మి, ఏపీఓ జ్యోతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముంగిళ్లలోనే మురుగు



ఒప్పిచర్ల గ్రామ ప్రధాన రహదారిలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంది. నీరు పోయే దారి లేక పొంగిపొర్లుతోంది. ముంగిళ్లలోనే నీరు పారుతుండడంతో దుర్గంధం, దోమల బాధతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆంజనేయస్వామి గుడి నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి కూడా వర్షం పడితే నడవడానికి వీల్లేకుండా ఉంటుంది. రోడ్డుతోపాటు దానికి ఇరువైపులా అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీని పునర్నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కారెంపూడి

గ్రామస్తుల ఫిర్యాదుపై విచారణ



విచారణ చేస్తున్న ఆర్డీఓ మురళీకృష్ణ

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి సచివాలయంలో గురజాల ఆర్డీఓ వి.మురళీకృష్ణ గురువారం విచారణ చేపట్టారు. పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం తమ భూములను కొనుగోలు చేసి ఉద్యోగాలు ఇవ్వటంలేదని, తమ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గ్రామస్తులు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆర్డీఓ మురళీకృష్ణ సచివాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలను సేకరించారు. భూములు కోల్పోయిన తమ కుటుంబాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యజమాన్యం హామీ ఇచ్చిందని, ఫ్యాక్టరీ నిర్మించి ఐదేళ్లు గడిచినా ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోందని గ్రామస్తులు చెప్పారు. కొంతమంది రైతుల భూములతోపాటుగా ప్రభుత్వ భూములను కూడా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని వారు ఆరోపించారు. భూములు అమ్మిన రైతుల కుటుంబాలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని, భూములకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందించాలని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యం ప్రతినిధులను ఆర్డీఓ కోరారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల కంటిచూపుపై శ్రద్ధ చూపాలి

కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: చిన్నారుల కంటిచూపు పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మాక్స్‌విజన్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచురెడ్డి తెలిపారు. మాక్స్‌విజన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం కే-రిడ్జి స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ చెంచురెడ్డి మాట్లాడుతూ, సెల్‌ఫోన్, టి.విలను ఎక్కువగా చూడటంతో పాటు వాటి నుంచి వచ్చే రేడియేషన్ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. చిన్నారులు తరచూ తలనొప్పికి గురికావటం, కనుల వెంట నీరు కారటం వంటి పరిస్థితులను గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో విద్యార్థులను పరీక్షించి తగిన వైద్య సలహాలు అందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ జి.బర్నబాస్, అకడమిక్ కోఆర్డినేటర్ హేమంత్, ఇన్‌ఛార్జ్ కోట బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాల్సిందే



చిలకలూరిపేట -నరసరావుపేట మార్గంలోని కోండ్రుపాడు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

- లేకుంటే చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- చిలకలూరిపేట పరిసరాల్లో పర్యటన

చిలకలూరిపేటటౌన్: జాతీయ, రాష్ట్రీయ రహదారుల బ్లాక్‌స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుతో రోడ్డు ప్రమాదాలకు చెక్ చెప్పవచ్చని ఎస్పీ కంచి శ్రీనివాస రావు చెప్పారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే పలు రహదారులను స్థానిక పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే పట్టణంలోని ఏఎంజీ చెక్‌పోస్టు, ఆర్టీసీ బస్టాండ్, నరసరావుపేట సెంటర్, అడ్డరోడ్డు సెంటర్, రూరల్ మండలంలోని పసుమర్రు, బొప్పూడి, కొండ్రుపాడు, కావూరు, లింగంగుంట్ల గ్రామాల పరిధిలోని రహదారులను క్షేత్రస్థాయి పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రోడ్డు భద్రతా నియమాలు వాహనదారులు విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలు పాటించండి- ప్రమాదాలు నివారించండి అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని జిల్లాలోని అధికారులు, అలాగే వాహనదారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. పట్టణ శివారుల్లో అతి వేగంగా వాహనాలు నడపకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. ఎస్పీ వెంట నరసరావుపేట డీఎస్పీ వై.నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐ బండారు సురేష్ బాబు, చిలకలూరిపేట అర్బన్, రూరల్ సీఐలు పి.రమేష్‌బాబు, బి సుబ్బానాయుడు, రూరల్ ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఉన్నారు.

నట్టల నివారణ.. జీవాలకు రక్షణ

- 30వరకు టీకాలు పంపిణీ
- పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి
- పశుసంవర్ధక శాఖ అధికారులు



జీవాలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

నరసరావుపేట రూరల్: నట్టల నివారణ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈనెల 16 ప్రారంభమైన ఈ కార్యక్రమం 30వ తేదీ వరకు కొనసాగనుంది. అంతర్‌పరాన్న జీవులైన ఏలికపాములు, జలగలు, బద్దె పురుగులు కడుపులో చేరడం వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడే అవకాశం ఉంది. సకాలంలో నట్టల నివారణ మందు(డీవార్మింగ్) ఇవ్వడం ద్వారా దీనిని నివారించవచ్చు. నియోజకవర్గంలో 45వేల గొర్రెలు, మేకలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌లు గొర్రెలకు, మేకలకు టీకాలు అందించే విధంగా శాఖాపరమైన ఏర్పాట్లు చేశారు. పశుపోషకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు.

నట్టల వ్యాధి లక్షణాలు..

భూమికి దగ్గరగా ఉన్న గడ్డిని తినడం వలన గొర్రెలలో ఉండే అంతరపరాన్న జీవుల గుడ్లు పేడ ద్వారా నేలపై చేరి లార్వాలాగా అభివృద్ధి చెంది గడ్డిపై చేరి ఉంటాయి. ఈ గడ్డిని గొర్రెలు, మేకలు తిన్నప్పుడు తిరిగి శరీరంలో ప్రవేశిస్తాయి. పేడను ముద్దగా వేయడం, విరేచనాలు చేసినప్పుడు అందులో బద్దె పురుగులు కనిపిస్తాయి. శరీరానికి అందే పోషక పదార్థాలను నట్టలు ఉపయోగించుకోవడం వలన గొర్రెలు బలహీనంగా ఉంటాయి. కొన్ని రకాల అంతరపరాన్ని జీవులు శరీరం నుంచి రక్తాన్ని పీల్చుకోవడం వల్ల రక్తహీనత కలిగి కళ్లు తెల్లగా పాలిపోయి ఉంటాయి. జలగలు కాలేయంలో ఉండటం వలన ఈ భాగం దెబ్బతింటుంది. దీంతో గడ్డం కింద నీరు చేరి వాపు వస్తుంది. ఈ వాపు సాయంత్రం వేళల్లో మాత్రమే కనిపిస్తుంది. జీవాలు బలహీనంగా ఉండటం వలన రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో న్యూమోనియా లాంటి ఇతర వ్యాధులు కూడా వ్యాపిస్తాయి.

నివారణ మార్గాలు..

జీవాలలో లక్షణాలు గుర్తిస్తే పేడను పరీక్ష చేయించి పశువైద్యాధికారి సిఫారసు చేసిన మందులను వాడాలి. చనిపోయిన గొర్రెలకు పరీక్ష చేయించి ఏదైనా వ్యాధి ఉన్నట్టు నిర్ధారిస్తే మిగిలిన మందకు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకోవాలి. ఏడాదికి కనీసం నాలుగుసార్లు నట్టల నివారణ మందులు తాపించాలి. పశువైద్యాధికారి సూచనలు మేరకు ఏలికపాములు ఉన్నట్టయితే అల్బెండజోల్, ఫెన్‌బెండజోల్ తాపించాలి. జలగలు ఉన్నట్టయితే ఆక్సిక్లోజనైడ్, రఫాక్సినైడ్, క్లోజంటాల్ వాడాలి. బద్దె పరుగులు ఉన్నట్టయితే నిక్లోజమైడ్ లాంటి మందులు తాపించాలి.

మందు ఇచ్చే సమయంలో జాగ్రత్తలు

జీవాల వయస్సు బరువును బట్టి సరైన మోతాదులో మందు ఇవ్వాలి. తక్కువగా ఇస్తే పని చేయదు. ఎక్కువ మోతాదులో ఇవ్వడం వలన గర్భంతో ఉన్న జీవాలకు అబార్షన్ అయ్యే అవకాశం ఉంటుంది. నట్టల మందు తాపించే ముందురోజు తక్కువ మేత ఇవ్వాలి. ఉదయాన్నే జీవాలకు మేతకు తీసుకుపోయే ముందే మందు తాపించాలి.

టీకాలు సద్వినియోగం చేసుకోండి



గొర్రెలు, మేకలలో నట్టల నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన నట్టల నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి. నట్టల వ్యాధి వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. సొంత వైద్యం మాని, పశువైద్యాధికారులు సలహాలు, సూచనలు పాటించాలి. టీకాలు వేయించడం వలన జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా పెంపకదారులకు మంచి లాభాలు వస్తాయి.

–కె.రామచంద్రరావు,
ఏడీ, పశుసంవర్ధక శాఖ

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నరసరావుపేట రూరల్: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మద్యానికి బానిసైన పెదరెడ్డిపాలెంకు చెందిన మార్పుల లక్ష్మయ్య (29) వారం క్రితం పురుగుమందు తాగి ఇంటి వద్ద ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు అతడిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

నరసరావుపేట: పట్టణంలోని హార్ట్ జూనియర్ కాలేజ్ కాంపౌండ్ 12 ఎకరాలు, ఏబీఎస్ వెస్ట్ కాంపౌండ్ 3.75 ఎకరాల ఆస్తిని కొంతమంది వ్యక్తులు అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకొని చేస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలని ప్రాపర్టీ కస్టోడియల్ కనుమూరు జయరాజ్ కోరారు. ఈ మేరకు గురువారం బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావుతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి విన్నవించారు.